పదిహేను - పది

బాబూరావును ఇంతవరకు ఎవరూ అర్థం చేసుకోనూ లేదు, చేసుకుంటారని సమ్మకమూ లేదు.

అతను చాలా మంచివాడు. ఒకరికి కష్టం కలిగించే పని ఏదీ చెయ్యకూడదనీ, ఇతరులకు చేతనైన సాహాయ్యం అడగకుండానే చేస్తూవుండాలనీ అతని అభిప్రాయం. కాని ప్రతి విషయంలో ప్రతిచోటా తిట్లుతినటం తప్పటంలేదు.

బజారువెంట వెడుతున్నాడు. అతని పక్కనే పాతి కేళ్ళ వయస్సులోవున్న ఒక అమ్మాయి నడుస్తూవున్నది. 'ఎవరా ఈ మనిషీ' అని ఒకసారి చూచి ఆడమనిషీ అని తెలియటంతోనే చటుక్కున తల వంచేసుకున్నాడు. ఎందుకూ ఆ పిల్లవంక చూడటం ? అతనికేంపని ? ఆడపిల్లవంక అల్లాగ చూసే స్వభావం కలవాడై తేకద, బాబు ! తల వంచేసు కొన్నాడంటే తెలియటంలేదూ అతని స్వభావం ఎల్లాంటిదో?

తల వంచుకొని తనదారిని తాను పోతున్నాడు. ఆపిల్ల ఏదో గొణుక్కుంటున్నది—ఏమిటి అంటున్నది ? తననేమైనా అంటున్నదా ? తను ఆ అమ్మాయిని ఏమైనా అంటేగద కోపానికి ?

ఏమి అనుకొంటున్నదో విందామని బాబుకు తోచింది. ఆపిల్ల ఏమనుకొంటే ఏం ? తనదారిని తను పోరాదా అని అంటారు. బాబూ మంచివాడన్నాను గానీ—అతడేమీ

మహాఋషి అని నేను అనలేను. అతనికి రెండు శ్రవణేంద్రియాలు మంచి స్థితిలో వున్నాయి. మనిషికి సహజంగా కలిగే కోరికను అణచుకొనే నిగ్రహశక్తి లేదు. అయితే ఏమైనా పాపిష్టి ఆలోచనలు చేశాడా? శివ! శివ! అల్లాంటి ఆలోచనలు ఏమీ లేవు—ఆపిల్ల ఏమనుకొంటున్నదో విందామని బుద్ధికలిగింది. అంతే! అల్లాగ బుద్ధికలగటమే మహాపాపం అని అంటే నేను ఏమీ చెప్పలేను. మనలో చాలా మందికి, అల్లాంటి స్థితిలో అల్లాంటిబుద్ధి పుడుతుందని మాత్రం నేను గట్టిగా చెప్పగలను.

అందులో—

బాబు చిన్నవాడు. పాతికేండ్ల కుఱ్ఱవాడు, 'లా' చదువుతున్నాడు. ఇంకా అతను భగవద్గీతా, భజగోవిందం అవీ చదవలేదు. అందుకనే ఆపిల్ల ఏమి గొణుక్కుంటూ వున్నదో తెలుసుకోవలెనని మనస్సులో అనుకొన్నది!

అదీగాక,

అల్లా అనుకోటంకూడా తప్పు అనీ అతడు ఏ 'లా' లోనూ చదవలేదు. పరాశరస్మృతీ, యాజ్ఞవల్క్యస్మృతీకూడా బాబూ చదివాడు ఇంగ్లీషులో. ఇల్లాంటి ఆలోచనలు మనిషికి రాకూడదనీ, వచ్చినట్లయితే ఆ పురుషుడు రౌరవాది మహా నరకాలను పొందుతాడనీ ఎక్కడా లేదుకూడాను.

అట్లా అని ఆపిల్లవాడు, ఆ కుఱ్ఱదానిదగ్గరకు వెళ్ళి, 'ఓ అమ్మాయ్ నీవు ఏమిటి అనుకుంటున్నావు' నన్ను గురించి

ఏమైనా అనుకొంటున్నావా ?'—అని అడిగాడా ! అడగ లేదు, అతనికి నిగ్రహం కూడా ఉందని చెప్పటానికి నేను సందేహించను. అల్లాగ అడగనూ, లేదు. ఆపిల్ల వంక చూడనూ లేదు. అల్లాగ తలవంచుకొనే కన్నెత్తి చూడకుండా నోరు తెరచి మాట్లాడకుండా ఆ పిల్ల ఏమను కొంటున్నదీ వినటానికి ప్రయత్నించాడు.

చెవులు రెండూ ఆ ఆడమనిషి వైపుకు త్రిప్పి నట్లయితే, కొంత అనుకోవలసిందే మనము! కాని ఆ అబ్బాయి, మామూలు గానే నడుస్తూ మామూలు గానే చూస్తూ, మామూలు గానే వింటూ ఒక చెవిమాత్రమే ఆమె దిక్కునకు పెట్టి విన్నాడు.

నిజంగా బాబు ధీరోదాత్తుడు అనికూడాఅనవచ్చును.

బాబు ఒక చెవితోఎల్లాగయితే వింటున్నాడో, అల్లాగే ఒక కన్నుతో ఆపిల్లను చూస్తున్నాడూ అనటం కేవలం అన్యాయమేమో ! ఆ విషయం చెప్పలేను. నిజం నాకు తెలియదు.

ఆపిల్ల ఎందుకో తనలో తాను నవ్వుకొంటున్నది. అరె ! ఆమె దంతాలు ఎంత ధవళంగా ఉన్నాయి, నల్లని ఆకాశంలో తళుక్కున మెరుపు మెరిసినట్లు అయింది. ముఖం అంతాకూడా ధగధగ మెరిసిపోయింది. ఇంత విచిత్రం జరిగినా కూడా బాబూ ఆవిషయం గమనించినట్లు లేదు.

బాబూతలవంచుకొనిఉన్నాడు.ఆమెఏమనిగొణుక్కుం

తెలుసుకోవలెననే ఉత్కంఠ అతనిలో గాఢంగా ఉంది. అదే అతనిలో స్థాయీ భావము పొందిఉన్నది. దీనికి ఏ విధమైన విభావఅనుభావ సంచారి వ్యభిచారిభావాలు మిళితంకాలేదు.

ఆ పిల్లమటుకు తనలో తాను అనుకొంటూ నడవటం ఏమిటి ?—అదీ, ఎవ్వరికీ వినపడకుండా వినపడకుండా మాట్లాడుకోటంచూస్తే ఎవరికైనా కష్టంగానే ఉంటుంది. బజారువెంట నడుస్తూ తనలోతాను నవ్వుకోటంకూడా చేస్తే! ఇదేమన్నా ప్రపంచమూ, మహారణ్యమూ! నవ్వుకొంటూ నడుస్తున్న పిల్లనుచూస్తే ఎవరికైనా బుద్ధిపుడుతుంది, 'ఏమిటి అమ్మాయి ఎందుకు నవ్వుతావూ?' అని అడుగుదామని. ఒక చిరునవ్వు పది చిరునవ్వులను పుట్టిస్తుంది. ఆ ఒక్క అమ్మాయి తనలోతాను ఎందుకో నవ్వుకొంటే, ఆ చుట్టుప్రక్కల ఉన్న పదిమంది పెదవులపైన చిరునవ్వు ఉదయించటమే చాలా విచిత్రమైన విషయంగా తోస్తుంది నాకు. ఒకచోట స్విచ్చి నొక్కి లైటు వెలిగిస్తే, పదిలైట్లు వెలిగినట్లు !

ఆ పిల్ల బాబూనుచూచి నవ్విందని నేను అనను. ఆ పిల్లకైనా ఇరవైఅయిదు ఏండ్లకంటె ఎక్కువ లేవు. పాపం అర్థం, శుభం తెలియని బిడ్డ. లోకపు పోకడలు తెలియవు. తాను నవ్వితే ఆ వెలుగు ఎంతలెక్క ప్రసరిస్తుందో, ఎవరి హృదయంలో ఎట్లాంటి భావాలనూ, వికారాలనూ పుట్టిస్తుందో, ఆ అమ్మాయికి తెలియదు. కామసూత్రాలు చదివి ఉంటేగద ! చదివి ఉన్నట్లయితే ఇట్లాంటి విషయాలు

తెలిసేవి. మనిషి జాగ్రత్తగా ప్రవర్తించి ఉండేది. అందుకనే కామసూత్రాలు పాఠశాలలలో బోధించవలెనూ అని కొందరు గోలపెట్టేది !

ఇంతకూ ఆ నవ్వటంకూడా బాబు చూడక, తలవంచుకొని నడుస్తూవున్నాడూ అంటే అతని యోగ్యత ఎట్లాంటిదో తెలుస్తూనే ఉందికదా !

ఆ కుఱ్ఱవాడు అల్లాగ, ఆపిల్ల అనుకుంటూ ఉన్నది ఏమిటూ అని చాలాసేపు బాధపడవలసిన అగత్యం లేక పోయింది. అతని అదృష్టంవల్ల ఆ అమ్మాయి తనలో తాను అనుకొంటున్న మాటలు వినిపించినవి.

మరేమీలేదు. ఆపిల్ల ఏదో లెక్కచూచుకొంటూ "పదిన్నీ-పది" అనుకొన్నది. అంతే!

బాబూనుగురించికాదు, ఈతను ఆ అమ్మాయివంక ఒక్కసారి చూశాడని చెప్పాను. అందుకనే ఆపిల్ల తననేదో అంటున్నది అని భ్రమపడ్డాడు. ఇప్పుడు అదేమీ కాదనీ ఆపిల్ల ఏదో లెక్కచూచుకొంటున్నదీ అని తెలుసుకొన్న తరువాత బాబు మనస్సు కాస్త కుదటబడ్డది.

అయితే పదిన్నీ పది ఎంతో ఆపిల్లకు తెలియక అవస్థ పడుతున్నది. చదువుకొన్నది కాదు అన్నమాట. తెల్లని చీర కట్టుకొని, నల్లని రవిక తొడుక్కొని, తలలో పూలుపెట్టుకొని తీరు-తాకుగా నడుస్తూవుంటే, చదువుకొన్న పిల్లేమో

అని అనుకోన్నాడు కాని, ఇప్పుడు తెలిసింది ఆపిల్ల ఊరుకోనే ఉంది. బాబుచేస్తున్నదే కాని అసలు సరుకు సున్నా అని.

ఈసంగతి గ్రహింపుకువచ్చేసరికి బాబుకు కాస్త నవ్వు వచ్చింది. ఈ పిల్లసంగతి ఇంతేనా అని! కొద్దిగా నవ్వాడు. మధురంగానూ, మందంగానూ ఉన్న ఆ చిరునవ్వును స్మితము అంటారు లాక్షణికులు.

ఇతడు నవ్వటం ఆ అమ్మాయి చూచింది. తనను చూచి ఈ అబ్బాయి నవ్వుతున్నాడని ఆపిల్ల అనుకోన్నది. పాపం, ఆ కుర్రవాడు ఏపాపమూ ఎరుగడుగదా, అట్లాంటప్పుడు ఆపిల్ల అల్లాగ అనుకోటం ఎంత పొరపాటు! అన్యాయము కూడాను!

ఆపిల్ల అల్లా అనుకోన్నదని బాబుకు తెలియదు. బాబూ ఆలోచన ఇప్పుడుఏమిటా అంటే ఆపిల్లకుపదిన్ని-పది అంటే ఎంతో తెలియలేదే ఎట్లాగా అని!

హిందూదేశంలో స్త్రీలలో ఇంత అజ్ఞానం ఉండటం సిగ్గుచేటు అని మనదేశ నాయకులని ఇల్లాగ పెద్దఎత్తు మాటలేమీ అతను అనుకోటంలేదు. హిందూస్త్రీల అజ్ఞానాన్ని పారదోలటానికి కంకణం కట్టుకోవాలె అని అనుకోటమూ లేదు—

కొందరు చిన్న విషయాలలోనుంచి చటుక్కున అల్లాగ భయంకరమైన పెద్ద విషయాల లోకిదూకి ఊరుకొంటారు.

బాబు చాలా శాంతంగా ఆలోచిస్తున్నాడే కాని ఏమాత్రం తొందర పడటంలేదు.

దేశముగొడన అతనికేమీ పట్టలేదు—ఆ పిల్లకు పదిన్నీ పది ఎంతో ఎట్లాగా తెలియకుటం అని ఆలోచించాడు. ఆ అంకెలు దేనికన్నా సంబంధించినవి కానీ, చాలా ముఖ్యమైనవిఅయి ఉంటవి. అంటే జీవితంలో ఒక గట్టి సమస్యకు సంబంధించినవి అయి ఉండాలి. లేకపోతే ఆ పిల్ల అంత తీవ్రమైన ఆలోచనలోకి దిగాలిసిన అవసరం ఉండేదికాదు—

పదిన్నీ—పది—కలిస్తే ఎన్నిరోజులు అవుతయ్యో అన్ని రోజులలో ఆమె ప్రియుడు దూరదేశాలనుంచి వస్తాడేమో !

పాపం, ఆవిషయము తల్చుకొనే కామాలు ఆ అమ్మాయి మొదట నవ్వుకొన్నది !

ఇప్పుడు ఆ పిల్ల మొఖంచాలా విచారంగాఉంది. ఏదో అమాయికమైన చూపులు చూస్తున్నది. ఎక్కువగా వ్యాకులత పడుతూ ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తూనేఉంది పదిన్నీ పది ???? పాపం ఇంత చిన్న విషయం తెలియకపోవటం వలన ఎంత పెద్ద వ్యాకులత కలిగింది !!

ఆమె భర్తరాకను గురించో లేక ఆమె తల్లిగారి ఇంటికి వెళ్ళవలసిన మంచిరోజును గురించో ఆమె లెక్కచూస్తూఉండవచ్చు. ఏదైనది బాబుకు తెలియలేదు—కాని తాను, బి. ఏ ప్యాసుఅయి. 'లా' చదువుతూఉన్న వ్యక్తి అక్కడ

ఉండగా, ఒక చిన్నపిల్ల, అసహాయురాలు, అబల, సౌంద ర్యవతి, మందగమన, కుంజరదన, చంచలాక్షి అల్లాగ నిట్టూ ర్పులు విడుస్తూ, తలవంచుకొని వ్యాకులత పొందుతూ ఉండ టం మటుకు బాబు చూడలేక పోయినాడు.

చాలా స్వల్ప విషయం 'పదిన్నీ-పది' అనిపిస్తుంది. కాని మనకేం తెలుస్తుంది ఆ అంకెలు, ఏ స్నిగ్ధహృదయం గల ప్రియాగమనానికి సంబంధించినవో!

బాబూ ఇల్లాగ తలపోయటంవల్ల ఆ పిల్ల పడుతూ వున్న బాధ సంగతి దేముడెరుగు గాని, ఇతని మనోవ్యథ మటుకు చాలా అధికమైనది.

బాబూ మరొకసారి ఆ పిల్లవంక చూశాడు. ఆపిల్ల కళ్ళవంక చూచి ఆమె పడుతూఉన్న విచారం అంతా తెలు సుకోవచ్చును అని అతని ఉద్దేశం.

ఇన్నిసార్లు చూడాలా ఆ పిల్ల పడుతూవున్న మనో వేదన తెలుసుకోంటానికి! ఒక్కసారి చూస్తే చాలదూ! నిజానికి చాలుకాని బాబూకు ఈ ముఖవైఖరి శాస్త్రంలో ఇంకా అనుభవం తక్కువ. ఇల్లాగ మాటిమాటికీ, ఎందు కన్నాగానీ, ఆ పిల్లముఖంకేసి చూడటంవల్ల ఆ పిల్లకు అతణ్ణి చూస్తే చాలా కోపం వస్తూఉన్నది. ఆ కోపమూ, విము ఖతా అన్నీ ఆ అమ్మాయి కళ్ళల్లో కనపడుతూనే ఉన్నవి కాని బాబు ఆ చూపులకు ఇంకో అర్థం కల్పించుకొని, పది న్నీ—పది— ఎంతఅవుతుందో తెలియకపోవటం చేతనే చిరాకుపడి అల్లాగ చూస్తున్నదీ అనుకొన్నాడు—

'లా' చదువుతూవున్న కుర్రవాడు ఈ మాత్రం అర్థం చేసుకోలేకపోయినాడా అంటే నేను ఒప్పుకోను. ఈఆడవాళ్ళ చూపులకు అర్థాలు కల్పించడంలో మహామహా వాళ్ళే తల్లక్రిందులైనారు.

ఇంతకూ అతని ఖర్మంకూడా కలిసివచ్చిందో ఏమో అల్లాగ అర్థం చెప్పుకొన్నాడు——

చెప్పుకొని చాలా విచారాన్ని పొందాడు. ఆపిల్ల, పాపం, ఏవిషయాన్ని గూర్చి తెలుసుకోలేక బాధపడుతున్నదో, ఆ విషయం తనకు తెలుసు. అట్లా తెలిసిఉండీకూడా ఆ విషయం చెప్పకపోతే, ఆపిల్ల పొందే మనోవ్యధకు తాను కారణభూతుడు అవుతున్నాడు.

ఒకరు బాధపడటం బాబు చూడలేడు. అందులో నిస్సహాయురాలైన ఒక స్త్రీ ఒక స్వల్ప విషయాన్ని గురించి వ్యాకులత పొందుతూవుంటే తాను సాహాయ్యము చేయగల స్థితిలో ఉండికూడా చేయకపోవటం కేవలమూ క్రౌర్యం అని బాబు మనస్సుకు తోచింది. పాపము, ఆపిల్ల లేత హృదయము ఎంతగా పరితపిస్తున్నదో శివ, శివా! అని బాబు వ్యాకులిత మనస్కుడు అయినాడు.

బాబు క్షణకాలము ఈ విషయమై ఆలోచించాడు. పదిన్నీ——పది ఎంతో చెప్పేస్తే ఆపిల్ల సంతోషిస్తుందిగదా! ఎందుకు ఈ విషయమైన ఇంత ఆలోచన? చెప్పేద్దాము అనే నిశ్చయానికే వచ్చాడు.

ఇంకో విచిత్రం ఏమిటీ అంటే: 'పదిన్నీ—పది' అని ఆపిల్ల అనుకోగా విన్నతరువాత, ఎంతోసేపు కాకముందే ఈ నిశ్చయానికి వచ్చాడు బాబు. అతని ఆలోచనలన్నీ గిర గిరా బహువేగంతో తిరిగిపోయినవి. వ్రాయటానికి ఇంత ఆలస్యం అయిందిగాని.

ఇంతకూ ఆ కుఱ్ఱవాడు ఆ అమ్మాయి బాధ చూడ లేక పదీ—పది ఎంతో చెప్పివేయటానికే నిశ్చయించాడు. అల్లాగ చెప్పటం, త్రిదోషాలలో ఒకటికాదు అనీ, అందులో తప్పు కించిత్తుకూడా లేదనీ, గట్టిగా నిశ్చయించుకొన్నాడు బాబు.

కేవలం ఒక వ్యక్తికి సంతోషం చేకూర్చాలన్న ఆతు రతతో, పరోపకారబుద్ధితో, బాబు నిర్మల చిత్తంతో, ఆ ఆడపిల్లను కొంచెంగా సమీపించి పరస్త్రీతో మాట్లాడే సమయంలో తాను జూపవలసిన వినయం మొదలుగాగల సముచితమైన మర్యాదలతో, తన వాక్కులో మాధు ర్యాన్ని చొప్పించి, చిరునవ్వుతో అన్నాడు—'పదిన్నీ పది ఇరవయ్యో' అని.

ఆ పిల్ల ఎంతో సంతోషించి బాబూకు కృతజ్ఞత తెలుపవలసినది! కాని ఆమె ముఖంలో సంతోషం లేదు! పెద వులపై చిరునవ్వులేదు! కృతజ్ఞతా సూచకమైన రచన ఒక్క టీలేదు ఆమె ముఖంలో!

పైగా,

ఆమె ముఖకమలం ముకుళించుకుపోయింది. కనుబొమ్మలు ముడిపడ్డాయి. ఆమె కోపంతో, ముక్కుపుటాలు ఎగురవేస్తూ, కంపిస్తూవున్న అధరముతో 'నీకెందుకూ?' అన్నది రోషకషాయ నేత్రాలతో.

బాబు ఖిన్నుడైపోయినాడు. తాను చేసిన సాహాయ్యానికి ఇల్లాంటి ప్రతిఫలం వస్తుందని అతడు ఎప్పుడూ ఊహించివుండడు.

అప్పటికీ అన్నాడు —'పదీ పదీ ఎన్నో తెలియక నీవు గొణుక్కుంటూవుంటే నేను సాయపడ్డానుకాని నిన్నేమీ అనలేదే. ఎందుకు అమ్మాయ్ అంత చిరాకు పడతావూ' అని.

అంటే ఏం లాభం? ఆ పిల్ల ఏమంత మంచి స్వభావం కలది కానట్టుంది. న్యాయం అన్యాయం తెలుసుకొనే శక్తి కూడా ఉన్నట్లులేదు. బాబూను అర్థంచేసుకోలేక నానామాటలూ అన్నది ఇంగ్లీషులో.

ఆ అమ్మాయీ బి. ఏ చదువుతున్నదట! లెక్క తెలియక బాధపడలేదుట! ఊరికేనే అల్లాగ గొణుక్కోటం ఆ పిల్లకు అలవాటుట !!

అయితేమటుకూ !!

తాను తెలివిగలదే కావచ్చు. ఆ కుఱ్ఱవాడు ఆసంగతి తెలియకే పది, పదీ ఇరవై అని చెప్పివుండవచ్చు. అయితే మటుకు ఇంతలో ఏంప్రమాదం జరిగిందని, ఏమి అకృత్యం,

అత్యాచారం, అఘాయిత్యం జరిగిందనీ ఆ పిల్ల అల్లాగ గుంజుకొంటుందో నాకు అర్థం కాలేదు. పైగా అక్కడికి చేరిన నలుగురూ కూడా బాబూనే అన్నారు—'నీకెందుకయ్యా, ఆ పిల్ల నిన్ను అడిగిందా పది పదీ ఎంత అని? తనలో తాను అనుకొంటే నీవు చెప్పటం ఏమిటి?' అని. ఇల్లాగ ఎవరికి తోచినట్లు వారు అందరూ అన్నివిధాల అన్నారు ఆ అన్యాయి పక్షం చేరి!—??!

ఇంతకూ,

ప్రపంచం ఇల్లాంటిది! మంచిని అర్థం చేసుకోలేదు. ఖర్మం!—ఇల్లాగ ముక్కచివాట్లు తిని బాబూ తలొంచుకొని ఖిన్నుడై వెళ్ళిపోయినాడు ఆ రోజు—

బాబును ఇంతవరకు ఎవరూ అర్థం చేసుకోనూ లేదు. చేసుకొంటారని నమ్మకమూ లేదు.

స్వస్తి